క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మి హోమం



అమ్మవారి పల్లకీ ఊరేగింపు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్ నగర్‌లోని శ్రీ మొగదారమ్మ పద్మావతి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం మహాలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి హోమం చేశారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో గురువారం వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఈ సమావేశానికి భీమునిపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. రెడ్డిపల్లిలోని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు ఇంటి వద్ద ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి



ప్రసంగిస్తున్న ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ డా. శంకర్రావు

కొమ్మాది: ప్రపంచవ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంచుకోవాలని ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ డా. ఇ. శంకర్రావు తెలిపారు. గీతంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ కారణంగా లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నప్పటికీ, అదే సంఖ్యలో కొత్త తరం ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. యువతరం డిజిటల్ అక్షరాస్యత, నిరంతర విజ్ఞాన సముపార్జన, లోతైన విషయపరిజ్ఞానం, విశ్లేషాత్మక దృష్టిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొ. వై.గౌతమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

75 మంది రక్తదానం



రక్తదానం చేసిన అనిల్ నీరుకొండ విద్యార్థులు, సిబ్బంది

తగరపువలస: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో 75 మంది రక్తదానం చేశారు. ఇందులో మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారా మెడికల్, డెంటల్, ఇంజినీరింగ్ విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు. కార్యక్రమంలో వైద్యవిద్యా సంస్థల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, మెడికల్ డైరెక్టర్ చెంచురెడ్డి, రక్తదాన కేంద్రం వైద్యాధికారి మల్లాది శర్మ, కుంచం గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీన్ సుధాకర్ దాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

రాజీవ్‌నగర్‌లో వైద్యుల పర్యటన



రాజీవ్‌నగర్‌లో వివరాలు సేకరిస్తున్న డా. భరత్

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇద్దరికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో సాక్షి దినపత్రికలో 'రాజీవ్‌నగర్‌లో విజృంభిస్తున్న విష జ్వరాలు' శీర్షికన బుధవారం వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం ఎండాడ రాజీవ్‌నగర్ ప్రాంతంలో సాగర్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ భరత్ పర్యటించారు. ఈ ప్రాంతంలో జ్వరాల బారిన పడిన వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం శానిటేషన్ అధికారులతో మాట్లాడి దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేయాలని సూచించారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు

మాస్టర్‌ప్లాన్ రోడ్డు పనులు నత్త నడకన సా..గుతున్నాయి. మధురవాడ జాతీయ రహదారి నుంచి నగరంపాలెం మీదుగా సాక్షి కార్యాలయం వరకు ఉన్న సుమారు కిలో మీటరున్నర రోడ్డు నిర్మాణ పనులు 'మూడడుగులు ముందుకు .. ఆరు అడుగులు వెనుకకు' అన్న చందంగా ఉన్నాయి. దీంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. 10 గ్రామాలు, కాలనీల వాసులకు ఉపయోగపడే రోడ్డుపై పాలకులు, అధికారుల ఉదాశీనతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మాస్టర్ ప్లాన్ రోడ్డుకు మోక్షమెప్పుడో..!

- ఏళ్ల తరబడి సాగుతున్న నిర్మాణ పనులు
- ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగు
- నగరంపాలెం-మల్లయ్యపాలెం మధ్య మరీ అధ్వానం
- స్పందనలో తరచూ ఫిర్యాదులు
- కానరాని చర్యలు

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డులను విడదీస్తూ.. ఆ రెండు వార్డులకు దాదాపు సరిహద్దులా ఉన్న నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

సమన్వయ లోపంతో..

జీవీఎంసీ-వీఎంఆర్‌డీఏ అధికారుల మధ్య సమన్వయం లేక పనులు ముందుకు సాగడం లేదు. వీఎంఆర్‌డీఏ అధికారులు కనీసం నోరు కూడా మెదపడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించినా ఎన్నికల కోడ్ రావడంతో సగంలో ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఈ పనులు ప్రారంభించనే లేదు.. కనీసం గత పనులకు కొనసాగింపు అయినా లేదు.

ఇదీ పరిస్థితి..

ఈ రోడ్డును 2014లో మాస్టర్ ప్లాన్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. తర్వాత నగరంపాలెం నుంచి మల్లయ్యపాలెం వరకు పొడిగిస్తామన్నారు. కానీ, కనీస చర్యలు లేవు. అప్పటి నుంచీ ఈ రోడ్డుకు సంబంధించి ఏ పని చేపట్టినా నత్తనడకనే సాగుతుంది. హైవేను అనుకుని ఆక్రమణల తొలగింపు పనులు నేటికీ పూర్తిగా సాగలేదు. కనీసం జంక్షన్ కూడా విస్తరించలేదు. గెడ్డను అనుకుని పెరిగిపోతున్న ఆక్రమణల నియంత్రణకు కూడా అనేక విన్నపాలు తర్వాత రక్షణ గోడ కట్టారు.

రోడ్డు పూర్తయితే ప్రయోజనం ఇలా..

- ఈ రోడ్డు పూర్తి చేస్తే హైవేను ఆనుకుని ఉన్న ఆదిత్యనగర్, బాపూజీనగర్, పోర్టు కాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, కళానగర్, వాంబేకాలనీ, నగరంపాలెం, ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యపాలెం, అయోధ్యనగర్, బొట్టవానిపాలెం తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మందికి నేరుగా మరో అర డజను పైన కాలనీలు, గ్రామాలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుంది.
- మధురవాడ హైవే నుంచి వుడా కాలనీ – హరిత రోడ్డు డైరెక్ట్ కనెక్టివిటీ పెరిగి ట్రాఫిక్ కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి.



వీధి సందులా నగరంపాలెం గ్రామంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు



కనీసం కాల్వలు కూడా నిర్మించని మల్లమ్మపాలెం-సాక్షి కార్యాలయం రోడ్డు



కాల్వలు కూడా నిర్మించకపోవడంతో రోడ్డు పక్కన ఏర్పడిన మురుగు కుంటలు

ప్రధాన సమస్యలు ఇవే..

- హైవేను ఆనుకునే టీడీఆర్, ఇతర సమస్యల పేరు చెప్పి విస్తరించలేదు. కనీసం ఆక్రమణలు కూడా తొలగించలేదు. ఆదిత్యనగర్, శ్రీనివాసనగర్ నుంచి నగరంపాలెం చెరువు వరకు అసంపూర్తి పనులే చేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరగడమే కాకుండా, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- నగరంపాలెం గ్రామం మధ్య నుంచి కాకుండా గ్రామం వెలుపలి నుంచి రోడ్డు మళ్లిస్తామని చెప్పారు. అక్కడ భూములు ఇస్తామని చెప్పిన వారికి కూడా టీడీఆర్ విషయంలో స్పష్టత ఇవ్వలేదు.
- నగరంపాలెం నుంచి సాక్షి కార్యాలయం వరకు కనీసం 20 అడుగులు కూడా వెడల్పులేని పాత రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. విస్తరణ హామీకే పరిమితమైంది.
- కనీసం రోడ్డుకు మార్కింగ్ చేసి కాల్వల నిర్మాణం కూడా చేయకపోవడంతో రోడ్డు వెంబడి ఉన్న అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌస్‌ల వారు సొంతంగా కూడా కాల్వలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి.
- దీంతో రోడ్డు వెంబడి మురికి కుంటలు ఏర్పడి మురుగు, దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. నీరు పారక అవస్థలతో పాటు వివాదాలూ తలెత్తుతున్నాయి.

చిన్న చిన్న కారణాలతో పనులు ఆపేస్తున్నారు



ఈ రోడ్డు తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. తరచూ చిన్న చిన్న కారణాలు చూపి పనులు నిలుపుదల చేస్తున్నారు. మధురవాడ ప్రాంతానికి ఇది మొదటి మాస్టర్ ప్లాన్ రోడ్డు అయినా నామమాత్రపు పనులే చేపట్టారు. దీనిని మల్లయ్యపాలెం వరకు పొడిగిస్తామన్నారు. కాని చర్యల్లేవు. వేలాది మందికి ఉపయోగ పడే రోడ్డు ఇది. ప్రజా ప్రతినిధులు, అధికారులు దీని ప్రాధాన్యం గుర్తించి పనులు పూర్తయ్యేలా చూడాలి.

–వాండ్రాసి రవికుమార్, మధురవాడ క్వారీ సొసైటీ కార్యదర్శి

స్పందనలోనూ ఫిర్యాదు



హైవే నుంచి సాక్షి ఆఫీసు వరకు రోడ్డు అంతా ముక్కలు ముక్కలుగా తవ్వి సగం పనులు చేసి వదిలేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికార పార్టీ ముఖ్య నాయకులు కూడా ఈ రోడ్డులోనే ఉన్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు. స్పందనలో కూడా ఫిర్యాదు ఇచ్చాం. అధికారులు తక్షణమే స్పందించి, చర్యలు చేపట్టాలి.

– పి. రాజ్‌కుమార్, సీపీఎం మధురవాడ జోన్ నాయకులు

ఆందోళన చేపడతాం



నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నాయకులకు ఎన్నికల స్టంట్‌గా మారింది. ఇది చాలా ముఖ్యమైన రోడ్డు అయినా నిర్మాణ పనులను 10ఏళ్లుగా సాగదీస్తున్నారు. టీడీఆర్ డబ్బులు ఎవరికి అందినంత వారు తిన్నారు. అయినా పనులు మాత్రం చేయడం లేదు. పాలకులు తక్షణమే స్పందించి పనులు చేపట్టకపోతే మా పార్టీ తరఫున ఆందోళన చేపడతాం.

–మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

పనుల పురోగతికి చర్యలు



పనుల పురోగతికి చర్యలు చేపడతాం. ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి మా పరిధిలో సమస్యలు మేము పరిష్కారం చేస్తాం. అవసరమైన విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం.

– ఎంవీడీ ఫణిరాం, జోనల్ కమిషనర్



నగరంపాలెం రోడ్డు పనుల గురించి జీవీఎంసీ స్పందనలో ఫిర్యాదు ఇస్తున్న సీపీఎం నాయకులు

సర్వీస్ రోడ్లపై పాక్షికంగా మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి జాతీయరహదారిని ఆనుకుని సర్వీస్‌రోడ్లపై నిలిచిన మురుగును నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం బుధవారం తొలగించి, బ్లీచింగ్ చల్లించింది. ఇక్కడి సర్వీస్‌రోడ్లపై వారం రోజులుగా నారాయణ జూనియర్ కళాశాల నుంచి రవీంద్రభారతి స్కూల్ వరకు కిలోమీటరు పరిధిలో నిలిచిపోయిన మురుగు సమస్యను 'చెరువులా వెల్లంకి సర్వీస్ రోడ్లు' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో మోటార్లు ఉపయోగించి డ్రైనేజీలలో మురుగును పక్కనే ఉన్న వారి ఖాళీ స్థలంలోకి తోడటం ప్రారంభించారు.



నారాయణ జూనియర్ కళాశాల ముందు మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లిన దృశ్యం

సాయంత్రానికి నారాయణ కళాశాల వద్ద నీరు తగ్గిపోగా, రవీంద్రభారతి స్కూల్ వద్ద సర్వీస్ రోడ్డుపై పాక్షికంగా మురుగు నిలిచిపోయింది. పూర్తిగా సర్వీస్ రోడ్లపై నుంచి మురుగును తొలగించాలని వెల్లంకివాసులతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి మామిడి తోటలో గురువారం 1.5 కిలోల గంజాయితో ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. వివరాలివి.. దేవరాపల్లి మండలం వంతలపాకకు చెందిన పాలిక బొరసు ఈ గంజాయిని ఏజెన్సీ నుంచి ఇక్కడికి అమ్మడానికి తీసుకువచ్చాడు. అతనితో పాటు పద్మనాభం మండలం కురపల్లికి చెందిన నిమ్మకాయల సాయి ప్రసాద్ , ఆనందపురం మండలం పందలపాక గ్రామానికి చెందిన తమట ప్రేమ్‌గోపాల్ కురిపల్లి మామిడి తోటలో ఈ గంజాయిని పొట్లాలు కడుతున్నారు. ఈ క్రమంలో తమకు సమాచారం అందడంతో, దాడి చేసి ఈ ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కూటమి నాయకుల బరితెగింపు

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

తగరపువలస: ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురంలో కూటమి నాయకులు బరి తెగించి, కొండలు కొల్లగొడుతున్నారు. బంజరు భూములను సైతం వదలడం లేదు. గత రెండు రోజులుగా సర్వే నంబర్ 1,7,8 లలో భారీ యంత్రాలు, లారీలు వినియోగించి గ్రావెల్ తవ్వి, దాంతో సమీపంలో ఉన్న రియల్ ఎస్టేట్ భూములను ఫిల్ చేస్తున్నారు. పెద్దిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థల ఆవరణను ఎత్తు చేయడానికి కూడా ఇక్కడి గ్రావెల్‌ను తరలిస్తున్నారు.

రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

పందలపాక ఐటీబీపీ బెటాలియన్‌ను ఆనుకుని బుధవారం ఉదయం 11 గంటల వరకు యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలించినట్లు జగన్నాథపురం వాసులు ఆనందపురం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి వీఆర్వో సెలవులో ఉండటం, ఇన్‌చార్జి వీఆర్వో మండలంలోని రీ సర్వేకు వెళ్లిపోవడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. రూ.లక్షలు విలువైన గ్రావెల్, రాళ్లను పగలు, రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నా అడ్డుకట్ట వేయవలసిన రెవెన్యూ సిబ్బంది వారితో కుమ్మక్కయినట్లు ఆరోపిస్తున్నారు. గ్రావెల్ తరలింపు ఆపకపోతే భీమిలి ఆర్డీవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు జగన్నాథపురం వాసులు తెలిపారు.



జగన్నాథపురంలో కొండవాలు ప్రాంతం, బంజరు భూముల్లో గ్రావెల్ తరలించడంతో ఏర్పడిన గోతులు

సగర చక్రవర్తి వంటి పాలకులు ఆదర్శం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: శ్రీరామాయణం పాలకుల నుంచి ప్రజల వరకు అందరికీ ప్రవర్తన నేర్పిస్తుందని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. స్వప్రయోజనాల కంటే సమాజ ప్రయోజనాలే ముఖ్యమని బోధిస్తుందన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా 5వ రోజు బుధవారం ఆయన ప్రవచించారు. తప్పు చేసిన వాడు సొంత కుమారుడే అయినా, ఉపేక్షింపక సమాజ హితం కొరకు సగర చక్రవర్తి ప్రవర్తించాడని, ఇలా ఆలోచించే పాలకులు ఏ తరానికైనా ఆదర్శప్రాయులని అన్నారు. గంగావతరణ ఘట్టం ప్రవచనం సందర్భంగా గంగాజలం తెప్పించి ప్రత్యేకమైన కలశంలో ఉంచి, పూజల అనంతరం సభలోని వారందరికీ ఆ జలాన్ని ప్రోక్షణ చేశారు. నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పడిపోయిన వంకాయల ధర

తగరపువలస: హోల్‌సేల్ మార్కెట్‌లో వంకాయల ధర బుధవారం అకస్మాత్తుగా పడిపోయింది. ఆనందపురం మార్కెట్‌లో 22 కిలోల వంకాయల క్రేట్ రూ.250కే లభించింది. నాలుగు రోజుల క్రితం క్రేట్ ధర రూ.1000 నుంచి రూ.1200 ఉంది. మంగళవారం వీటి ధర రూ.400 నుంచి 500 ఉండేది. బుధవారం నాటికి ధరలు సగానికి పడిపోవడంతో రైతులు దిగాలు చెందారు. కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు మంచి ఊపు మీద ఉన్న వంకాయల ధర ప్రస్తుతం అన్‌సీజన్ కావడం, దిగుబడి ఎక్కువగా రావడంతో అమాంతం పడిపోయినట్టు రైతులు తెలిపారు. మాఘ మాసం ప్రారంభమైతే పెళ్లిళ్లు, గృహప్రవేశాలు ఉన్నందున మళ్లీ వీటి ధరలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ధరలు తగ్గినా రిటైల్ వ్యాపారులు మాత్రం బుధవారం కిలో వంకాయలు తగరపువలస ప్రైవేట్ మార్కెట్, ఆనందపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో రూ.30 వరకు విక్రయించారు.

ఎల్వీ పాలెంలో సమస్యలపై ఎంపీడీవోకు వినతి

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్కడి నాయకులు బుధవారం ఎంపీడీవో జానకికి వినతిపత్రం అందించారు. రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, జల్ జీవన్ పథకంలో భాగంగా ట్యాంకు నిర్మాణంతో పాటు నేలతేరులో 20 ఏళ్లుగా నోచుకోని రహదారులు, సీసీ డ్రైనేజీలు, ఎస్సీ కాలనీకి తాగునీటి వసతి కల్పించాలని కోరారు. నాడు-నేడులో నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవోకు వినతిపత్రం అందించిన వారిలో కొయ్య నాని, లొడగల సురేష్, అల్లి రాజు, గొలగాని సాయి, వెంకటేష్, తోట రాజు, బాలా ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

తగరపువలస: ఆనందపురం మండలంలోని కణమాం, గండిగుండం పంచాయతీలలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ఎస్.జానకి బుధవారం పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. ఆయా పంచాయతీలలో సచివాలయాల సిబ్బంది హాజరు, అంగన్‌వాడీ కేంద్రాలలో వంటశాలలను తనిఖీ చేశారు.

కుమార్తె ఆధార్‌కార్డులో వయసు మార్చి.. రూ.34 వేలు స్వాహా

ఆనందపురం పంచాయతీలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి జరిగిన అవకతవకలపై అందిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపారు. 11 మంది అనర్హులకు జాబ్‌కార్డులు ఇచ్చినట్టు ఫిర్యాదు అందినా, అందులో ఒక్కటే అనర్హతగా గుర్తించారు. అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్ గుడిలోవ స్కూల్‌లో చదువుకుంటున్న తన కుమార్తె ఆధార్‌కార్డులో వయసు మార్చి, పనికి రాకపోయినా రూ.34 వేల కూలి డబ్బులు కాజేసినట్టు గుర్తించి నోటీసు జారీ చేశారు.

మొక్కజొన్న పంటకు సస్యరక్షణ చర్యలు

పద్మనాభం: మొక్కజొన్న పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం సూచించారు.మద్ది, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించారు. దీని నివారణకు ఇమ్మా మెక్టిన్ బెంజియేట్ ఎనిమిది గ్రాముల మందును ఒక లీటరు నీటికి కలిపి పంటకు పిచికారీ చేయాలని ఏవో చలం సూచించారు. ప్రతి రైతుకు ప్రభుత్వం ఆధార్ నంబర్‌లా ఒక ఐడీ నంబర్ జారీ చేస్తుందన్నారు. పంట రుణాలు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు తీసుకునేందుకు ఈ నంబర్ ఉపయోగపడుతుందన్నారు. ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నవరంలో రైతుల తోపులాట

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ సర్వే నంబర్ 101/1లోని వివాదాస్పదమైన ఎ.199.28 సెంట్లు డీ పట్టా భూములకు సంబంధించి బుధవారం ఇరువర్గాల రైతుల మధ్య తోపులాటలు జరిగాయి. ఈ భూములలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం తూడెం రైతులతో పాటు భీమిలి మండలం అన్నవరం పంచాయతీ రైతులు తోటపంటలు సాగు చేసుకుంటున్నారు. గతంలో ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి ప్రతిపాదనలు వచ్చినప్పుడు కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం దీనిపై విచారణకు గాను కూటమి ప్రభుత్వం తహసీల్దార్ కె.వేణుగోపాల్‌ను నియమించింది. ఈ మేరకు ఆయన బుధవారం అన్నవరం రావడంతో ఇరువర్గాల రైతుల మధ్య స్వల్పంగా తోపులాట జరిగింది. దీంతో తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ సాగులో ఉన్న రైతులను గుర్తించి వారి హక్కులు కాపాడటానికి ప్రభుత్వం విచారణ చేస్తుందన్నారు. దానికి రైతులంతా సహకరించాలని కోరారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు ఈ విచారణ జరుగుతుందన్నారు.

'దివీస్' ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ

తగరపువలస: చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం బుధవారం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో 45, తూడెం జెడ్పీ హైస్కూల్‌లో 50, రావాడ జెడ్పీ హైస్కూల్‌లో 95 మంది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసింది. సంస్థ సీఎస్‌ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కామన్ ఎంట్రన్స్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్ చదివితే విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో ఎక్కువ మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.వి.టి. రత్నం, అప్పన్న, సూర్యనారాయణ, దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు చకచకా ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న పాఠశాల
- సిద్ధం చేస్తున్న వేదిక

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు సమీపించడంతో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఎంతో ఘనంగా ఈ వేడుకలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. పాఠశాల చూడచక్కగా ముస్తాబవుతోంది. భవనానికి అవసరమైన మరమ్మతులు చేయించడంతో పాటు రంగులు వేస్తున్నారు. ఇదే ఆవరణలో ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో కార్యక్రమాల నిర్వహణకు వేదిక, వచ్చేవారు కూర్చునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో 500 మంది వరకు పాల్గొంటారని అంచనా.

కార్యక్రమ నిర్వహణ ఇలా..

- మొదటి రోజు పాఠశాలలో పైలాన్ ఆవిష్కరణ, అనంతరం ర్యాలీ నిర్వహిస్తారు. బీచ్ సమీపంలో రతన్‌టాటా విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.
- రెండో రోజు పూర్వ విద్యార్థుల సమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు, ముగింపు కార్యక్రమం ఉంటాయి.



ఉత్సవ నిర్వహణ గురించి డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వివరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి : డీఈవో

భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల చరిత్ర గల పాఠశాలలు అరుదుగా ఉంటాయని, ఈ పాఠశాలకు ఆ గుర్తింపు ఉండడం గొప్ప విషయమని అన్నారు. ఉత్సవ నిర్వహణలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేందిరప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే ప్రతి ఒక్కరూ సంతృప్తితో తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, ముఖ్య సభ్యులు కాళ్ల సన్నీ, కె.ముత్యాలరావు, రాజేటి బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.



జూనియర్ కళాశాల మైదానంలో నిర్మిస్తున్న వేదిక